www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 18 ఆగస్టు 2024
5
అన్నమయ్య

విద్యుత్ విజిలెన్స్ అధికారుల మెరుపుదాడులు

18 మందిపై కేసు నమోదు - రూ.2 లక్షల జరిమానా విధింపు

ప్రజాశక్తి-రాయచోటి

విద్యుత్ శాఖ డిపిఇ ఎస్ఇ శ్రీనివాసబాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ డిఇ రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడిన పలు ఇండ్లలో దాడులు నిర్వహించారు. శనివారం నిర్వహించిన దాడులలో విద్యుత్ చౌర్యానికి అక్రమ విద్యుత్తు వాడుతున్న 18 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. రూ.2 లక్షల జరిమానాలను విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎడిఇ మధులత, ప్రవీణ్ కుమార్, ఎఇలు నాగరాజు, రామాంజనేయరెడ్డి, రవి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న అధికారులు

రాయచోటిలో దారుణం

- గ్యాస్‌తో నిప్పంటించుకుని కుటుంబం ఆత్మహత్య
- తల్లి, ఇద్దరు చిన్నారుల సజీవ దహనం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. శనివారం కొత్తపేటలోని తొగటవీధిలో నివాసం ఉంటున్న ఎర్రగుడి రమాదేవి(35) అనే వివాహిత తన ఇద్దరు పిల్లలు ప్రభు మనోహర్(7), మన్విత(5)లతో కలసి వంట గ్యాస్‌కు నిప్పు అంటించి ఆత్మహత్య చేసుకుంది. ఈ ప్రమాదంలో రమాదేవితో సహా తన ఇద్దరు పిల్లలు అగ్నికి ఆహుతై సజీవ దహనమయ్యారు. నివాసంలో నుంచి దట్టమైన పొగలు బయటికి రావడంతో చుట్టుపక్కల ఉన్నవారు అక్కడ చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ విషయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి జరిగిన సంఘటనపై చుట్టుపక్కల ఉన్న స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నివాసంలో ఉన్న వంట గ్యాస్‌కు నిప్పు అంటించి తన బిడ్డలతో కలిసి రమాదేవి అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రాయచోటి అర్బన్ సిఐ చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. రమాదేవి భర్త రాజా జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లినట్లు తెలిసింది. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి జరిగిన సంఘటనపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది? ప్రమాదానికి గల కారణాలను త్వరితగతిన గుర్తించాలని మంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు. మృతులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రమాదేవి, ఆమె పిల్లల (ఫైల్ ఫొటో)

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ముగ్గురు మృతి చెందడం దురదృష్టకరం : 'గడికోట'

రాయచోటి పట్టణం తొగట వీధిలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి చెందడం దురదృష్టకరమని వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాద సంఘటనలో తల్లి రమాదేవి, కుమారుడు ప్రభు కుమార్, కుమార్తె యశ్విని మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి అకాల మృతిపట్ల ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

'మానవత' సేవలు భేష్ : మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర వ్యాప్తంగా మానవత సేవా సంస్థ వారు అందించుచున్న సేవలు అభినందనీయమని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మానవత సేవా సంస్థ వారోత్సవాలలో భాగంగా పట్టణం గర్ల్స్ హైస్కూల్ నుండి మానవత అధ్యక్షులు ఖాదర్ బాషా, చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకట రమణ, కేంద్ర కమిటీ డైరెక్టర్ సభ్యులు సహాదేవ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్ రెడ్డి, మాజీ అధ్యక్షులు చింతం వెంకట్రామి రెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, ట్రెజరర్ మురళి మోహన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వ్యవస్థాపకులు నిమ్మనపల్లి రామచంద్రారెడ్డి, మాజీ కడప అధ్యక్షులు సుబ్బారాయుడు, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సుబ్బారెడ్డి హాజరయ్యారు. మానవత వ్యవస్థాపకులు రామచంద్ర రెడ్డి, మానవత కుటుంబ సభ్యులతో కలిసి జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. ఈ ర్యాలీ గాలివీడు రోడ్ నుండి గాంధీ బజార్, నాలుగు రోడ్ల కూడలి, నేతాజీ కూడలి మీదగా బస్టాండ్, తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. నేతాజీ కూడలి దగ్గర మానవ హారంగా నిలబడి మానవత సంస్థ సేవలు, సమాజం పట్ల ప్రజలు చూపించాల్సిన ఆదరణ పలు విషయాలపై ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మానవత సమస్యను ఉద్దేశించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక మారుమూల ప్రాంతమైన జంగారెడ్డిగూడెంలో కష్టాల్లో ఉన్న ప్రజలకు తమ వంతు సహాయంగా సేవ చేయాలన్న సహృదయంతో రామచంద్రారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో మానవత సంస్థ ద్వారా సేవలు అందజేయడం చాలా హర్షణీయమన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి ఆసుపత్రికి చేర్చేందుకు అంబులెన్స్,మ ృతి చెందిన వారి బాడీని భద్రపర్చేందుకు బాడి ఫ్రీజర్ బాక్స్‌తో పాటు శాంతి రథం ద్వారా సేవలు అందిస్తూ మానవత సంస్థ దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణాన్ని పెంపొందించేలా మొక్కలు నాటడం వాటిని సంరక్షించడంతో పాటు విద్యార్థులకు మానవత నైతిక విలువల పట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించడం వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందజేయడం కూడా చాలా అభినంద దగ్గ విషయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న మానవత సంస్థకు తమ వంతు సహాయసహకారాలు అందజేస్తానన్నారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దాతలు సహకారం, మానవత కుటుంబ సభ్యులు సమిష్టి కృషితో మానవత సంస్థ సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా సేవలను వ్యాపింపచేయడమే తమ సంస్థ యొక్క ఆశయం పేర్కొన్నారు. శాంతి ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీ ప్రారంభోత్సవం పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ముందు ముందు కూడా ఎటువంటి లాభాపేక్షకుల మత భేదాభిప్రాయాలు లేకుండా అవసరం ఉన్న వారికి మానవత సంస్థ సేవలు అందజేస్తామని వ్యవస్థాపకులు వివరించారు. కార్యక్రమంలో ప్రతిభా జూనియర్ కళాశాల, విద్యార్థులు వారి సిబ్బంది, గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు, వారి సిబ్బంది మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రాణం పోసే డాక్టర్ల ప్రాణాలు తీయకండి

- జిల్లా వ్యాప్తంగా వైద్యుల నిరసన ర్యాలీలు
- అత్యవసరం మినహా అన్ని వైద్య సేవలు నిలిపివేత
- నిందితులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైద్య విద్యార్థి హత్యాచారంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) 24 గంటల సమ్మెకు పిలుపు నేపథ్యంలో జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల వైద్యులు, వైద్య విద్యార్థులు నిరసనలు చేశారు. ర్యాలీలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని వైద్య సేవలను నిలిపివేశారు. ప్రాణం పోసే డాక్టర్ల ప్రాణాలు తీయకండి, వైద్య విద్యార్థికి న్యాయం జరగాలి, ప్రజల ఆరోగ్యం మా నిబ్ధత, డాక్టర్ల రక్షణ మీ బాధ్యత అంటూ నినాదాలు చేశారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని, జూనియర్ డాక్టర్‌పై గ్యాంగ్ రేప్ చేసి హత్య చేసిన దుర్మార్గులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి వైద్యసిబ్బంది, ప్రయివేట్ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జమున, ఆర్ఎంఒ ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఆసుపత్రిలో ఓపి సేవలను బహిష్కరించి నినాదాలు చేస్తూ పురవీధుల గుండా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **ఐద్వా ఆధ్వర్యంలో నిరసన :** పశ్చిమ బెంగాల్ కలకత్తాలో జూనియర్ డాక్టర్ మోమితను అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఐద్వా కన్వీనర్ ఎం.భాగ్యమ్మ డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడుతూ 36 గంటలు నిరవధికంగా వైద్యసేవలు అందించి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో నరరూప రాక్షసులు అతికిరాతకంగా ప్రవర్తించి గ్యాంగ్ రేప్ అత్యంత పాశవికంగా హతమార్చారన్నారు. ఆ రాక్షసులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో ఒక్కడినే మాత్రమే బాధ్యున్ని చేసి కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అఘాయిత్యానికి పాల్పడిన అందరికీ శిక్ష పడాలన్నారు. అత్యాచారం చేసిన ముద్దాయిలను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకొని మహిళలకు ఉన్నటువంటి రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా సభ్యులు ఎస్.షాహినా, ఎస్.రెడ్డి ప్రసన్న, జి.గాయత్రి, ఎ.అంజలి, శాంతమ్మలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం,హత్య కేసులో న్యాయం చేయాలని బి.కొత్తకోట ఇపత్రి నుంచి జ్యోతి చౌక్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించిన బి.కొత్తకోట సిహెచ్.సి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హసీనా మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కంభంవారిపల్లి :** గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గర్నిమిట్ట గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేష్మ మాట్లాడుతూ కోల్‌కత్తాలో జరిగిన సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, బాధితురాలికి న్యాయం జరగాలని, నిందితునికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. **రైల్వేకోడూరు :** వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని రైల్వేకోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థిపై జరిగిన సంఘటనకు సంబంధించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనగా చేపట్టారు. ఉదయం నుంచి ఒపి విభాగాలను బహిష్కరించారు. ఎజిఐ సంఘం కోడూరు తాలూకా అధ్యక్షులు పి.ఓబులేసు వారికి సంఘీభావం తెలియజేశారు. **పుల్లంపేట :** కలకత్తాలో డాక్టర్ పై జరిగిన సామూహిక దాడికి నిరసనగా ఎపిఎండిసి హెల్త్ క్యాంపులో పనిచేస్తున్న డాక్టర్లు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ దేశంలో డాక్టర్లకు భద్రత కరువైందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని డాక్టర్లకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రాణాలు కాపాడే డాక్టర్లకే ఇలా జరగడం పట్ల డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. **తంబళ్లపల్లి :** మండలంలోని కన్నెముడుగు, ఉన్నత పాఠశాల, ఎద్దు లవారికోట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంల ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఎన్నికలు జరిగాయి. కన్యమడుగు ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్‌గా రెడ్డి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా వనిత, ఎద్దులవారికోట ఎస్ఎంసి చైర్మన్‌గా వై.మల్లికార్జున, వైస్ చైర్మన్‌గా సరోజలు ఎంపికయ్యారు. ఎస్ఐ లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. **కలికిరి:** వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందితో కలిసి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, మహిళలకు రక్షణ లేకుండా పోవడం బాధాకరమని, మహిళలపై దాడి చేసే వ్యక్తులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని అప్పుడే ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు. మేడుకుర్తి వైద్యుత్ చెన్నారెడ్డప్ప మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పట్ల విద్యార్థినులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి సంఘటనలు ఉపేక్షించకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **పీలేరు :** పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఆవరణంలో ఐఎంఎ పీలేరు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యులు, వైద్య సిబ్బంది నల్లదుస్తులతో నిరసన తెలిపారు. తదుపరి అంబేద్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ధర్నా చేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి డాక్టర్ పవన్ కుమార్, కోశాధికారి డాక్టర్ ఈశ్వర్ సురేంద్ర, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ నాగవేణి, డాక్టర్ మంజుల, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, ప్రయివేట్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ గుప్త, డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, దంత వైద్యులు డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ ఆదీబ్ ఖాన్ పాల్గొని నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.

పీలేరు : నల్ల దుస్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు

మదనపల్లె : నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

రైల్వేకోడూరు : నినాదాలు చేస్తున్న వైద్యులు

మదనపల్లె : జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

వృద్ధులకు అన్నదానం చేస్తున్న విసికె నాయకులు

బహుజన యుద్ధ వీరుడు తోల్ తిరుమావళవన్

ప్రజాశక్తి-పీలేరు

ద్రవిడ గడ్డపై బహుజన రాజ్య స్థాపన కోసం వీరోచితంగా పోరాడుతున్న బహుజన యుద్ధ వీరుడు తలైవా తోల్ తిరుమావళవన్ అని విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. విసికె జాతీయ అధ్యక్షులు, చిదంబరం పార్లమెంట్ సభ్యుడు తలైవా డాక్టర్ తోల్ తిరుమావళవన్ 62 వ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పీలేరు పట్టణం, సదుం రోడ్డులోని శ్రీ లక్ష్మి వృద్ధాశ్రమంలో బాస్, విసికె పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విసికె రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలల పంట కాన్షీరామ్ తర్వాత అదే స్థాయిలో బహుజన రాజ్యాధికార ఉద్యమాన్ని ఉరకలేయిస్తున్న ఏకైక నాయకుడు తిరుమావళవన్ అని అన్నారు. ఫోరెన్సిక్ శాఖ శాస్త్రవేత్తగా పని చేసిన తిరుమావళవన్ కులం, మతం పేరుతో జరిగే దారుణాలను చూసి చలించిపోయి, ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి, వివాహం కూడా చేసుకోకుండా బహుజన రాజ్యాధికార సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, ఆరుమడకల నాగరాజు, పల్లెపోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, మల్లికార్జున, వీరయ్య, లక్ష్మి వృద్ధాశ్రమం నిర్వహరాలు విజయ కుమారి పాల్గొన్నారు.

అమూల్ డెయిరీని కొనసాగించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమూల్ డెయిరీని యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం చిప్పిలి సమీపంలో అమూల్ డెయిరీ ఎదుట పాడిరైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం సహకార సంఘాల పేరుతో, సచివాలయం సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు కలిసి, వాలంటీర్లతో అమూల్ డెయిరీకి పాలు సేకరించారన్నారు. అమూల్ డెయిరీ వల్ల పాడి రైతులకు గిట్టు బాటు ధరలు లభిస్తున్నాయని, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చాక అమూల్ డెయిరీని సమస్యల్లోకి నెట్టుతోందన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లకు అమూల్ డైరీ నుండి పాలు కొనుగోలు చేసేదని, ఈ ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లకు పాలు కొనుగోలు చేయడం మానేసిందన్నారు. వైసిపి, టిడిపి రాజకీయ కక్షలకోసం పాడిరైతులను బలిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబ, సిపిఐ చంద్రగిరి నియోజకవర్గ కార్యదర్శి బండి చలపతి, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి కె మురళి, మాధవ్, రెడ్డి, పాల్గొన్నారు.

ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించండి

- జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లోని ప్రయోగశాలలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి సైన్సు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం సైన్సు ఉపాధ్యాయుడి బాధ్యతని పేర్కొన్నారు. అందుకు ప్రయోగశాల సరైన వేదిక అని పేర్కొన్నారు. విద్యార్థులతో ప్రయోగాలు చేయించడం ద్వారా పాఠ్యాంశాలలోని శాస్త్రీయ భావనలను సులభంగా అర్థం చేయించవచ్చునని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, 17 స్టెమ్ ల్యాబ్ లు,20 పాల్ ల్యాబ్‌లు, 5 ఆస్ట్రానమీ ల్యాబ్ లు, 250 సైన్స్ ల్యాబ్ లు ఉన్నాయన్నారు. సైన్స్ ఉపాధ్యాయులంతా ఈ ల్యాబ్‌లను సక్రమంగా నిర్వహించి, ప్రయోగాలు, పరిశీలనలు, విధానాలు, ఫలితాలను రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ప్రమాదాలు, రసాయన ప్రతిచర్యలను నివారించడానికి భద్రతా మార్గదర్శకాలను పాటించాలన్నారు. ల్యాబ్‌లో భద్రతా జాగ్రత్త చర్యలను చూపించే చార్ట్‌ను వేలాడదీయాలని చెప్పారు. నిర్వహించడానికి సాధ్యం కానీ ప్రయోగాలను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ లను ఉపయోగించి సిమిలేషన్ ప్రయోగాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక వనరులను ఉపయోగించడం, క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలను కల్పించి శాస్త్ర భావనలను అవగాహన కల్పించాలన్నారు.

అవార్డు మరింత బాధ్యతను పెంచింది : రామాంజనేయులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉత్తమ అధ్యాపక అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎ.రామాంజనేయులు పేర్కొన్నారు. ఉత్తమ అధ్యాపకుడిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్న సందర్భంగా శనివారం రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శివరామరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు రామాంజనేయులకు అభినందన సభ నిర్వహించారు. రామాంజనేయులను అధ్యాపక బృందంతో కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివరామరాజు మాట్లాడుతూ తమ కళాశాల నుంచి ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకోవడం గర్వకారణమని తెలిపారు. రామాంజనేయులు మాట్లాడుతూ అవార్డులు బాధ్యతలు పెంచుతాయని, భవిష్యత్తులో మరింత చురుకుగా వ్యవహరించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం బి.చంద్రమోహన్, రవిచంద్ర నాయుడు, సిదకరరాజ ల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరం : జడ్జి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులకు జాతీయ సమగ్రత, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన ఉండాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అన్నారు. శనివారం రాజంపేట పట్టణంలోని రీజెన్సీ నలంద కళాశాలలో రీజెన్సీ నలంద విద్యాసంస్థల చైర్మన్ జి.ఎన్ నాయుడు ఆదేశాల మేరకు కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ సమైక్యత అనేది దేశ పౌరులలో ఒక సాధారణ గుర్తింపు గురించి అవగాహన, మతాలు, కులాలు, ప్రాంతాలు, వివిధ భాషలు మాట్లాడే అన్ని వర్గాల వారు ఒకటేననే భావన అని తెలిపారు. బలమైన, సంపన్న దేశాన్ని నిర్మించడానికి జాతీయ సమైక్యత ఎంతో ముఖ్యమని అన్నారు. వివిధ జాతుల, కులాల, మతాల వారి ఆలోచనలు ఏకం చేసి దేశాన్ని ఒకే అస్థిత్వంగా మార్చడంలో సహాయపడుతుందన్నారు. భారతదేశంలో సంస్కృతి, భాష, మతం, కులం, ప్రజలు, వంటకాలతో సహా అనేకంశాలలో దేశం విభిన్నంగా ఉన్నందున మనది సమైక్య దేశమని చెప్పారు. భారతదేశంలోని వ్యక్తులు, సమూహాలు, భౌతిక జనాభా లక్షణాలలో వారి ప్రవర్తనా విధానాలలో ఒకదానికొకటి విభిన్నంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి పసుపులేటి శంకర్

పోరుబాట!

ప్రజాదృష్టి

జిల్లాలో జూనియర్ డాక్టర్ల సమ్మె ఉధృతరూపం దాల్చింది. ఉమ్మడి కడప జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటి ఏరియా ఆస్పత్రులు, 72 పిహెచ్‌సిలు, 16 సిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు తమ భద్రతను కాపాడాలనే పేరుతో నల్లరంగు రిబ్బన్ ధరించి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. దేశంలోని పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న అత్యాచార ఘటనలకు నిరసనగా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నిరసన కార్యక్రమాల్ని తీసుకుంది. వైద్యుల భద్రతను కాపాడాలనే ప్లకార్డుల ద్వారా నినాదాలు చేస్తోంది. పెద్దఎత్తున ర్యాలీలు, ధర్నాలు చేస్తోంది. అత్యవసర వైద్యసేవలను మినహాయించింది. సాధారణ వైద్య సేవలను నిలిపేసింది. జూడాల పోరాటానికి మద్దతుగా ప్రజాప్రతినిధులు హాజరవుతుండడంగమనార్హం. రోజురోజుకూ జూడాల పోరు తీవ్రతను పెంచుతోంది. విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురా లిపై జరిగిన అత్యాచారాల్ని ఖండించాల్సిందే. ఎటువంటి శషబిషల కు అవకాశం లేదు. జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటన మరవ ముందే ఉత్తరాఖండ్‌లో నర్సుపై మరో అత్యాచారం చోటు చేసుకోవడం పుండు మీద కారం చల్లిన చందంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో జూడాల సమ్మె తీవ్ర రూపం దాల్చింది. దేశంలో అంతంతమాత్రమే వైద్య సేవలు అందుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా స్పందించాల్సిన అవసరం ఉరుముతోంది. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 500 మంది నుంచి 700 మంది మందికి ఒక వైద్యుని చొప్పున వైద్యసేవలు అందుతున్న సంగతి తెలిసిందే. భారతదేశంలో ప్రతి 1,500 మంది నుంచి 1,750 మందికి ఒకరు చొప్పున వైద్యసేవలు అందుతున్న పరిస్థితి నెలకొంది. గణాంకాల ఆధారంగా దేశంలో వైద్యసేవల పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నర్సుల పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేలేదు. అరకొర వైద్యసేవలు అందుతున్న పరిస్థితుల్లో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు సత్వరమే స్పందించాలి. వైద్య సేవలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలి. వైద్యసేవల బలోపేతం చేయడానికి అడ్డంకిగా మారిన సమస్యల పరిష్కారంపై సమష్టిగా దృష్టి సారించాలి. అనాగరిక ఘటనలకు పాల్పడిన నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వరమే తీర్పులొచ్చి శిక్ష పడేలా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో పేదలకు అందాల్సిన వైద్యసేవలకు అంతరాయం ఏర్పడితే పరిస్థితేమిటో ఆలోచించాలి. సామాన్య రోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారనుంది. ఇటువంటి ఘటనలు సామాన్యుల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపించే అవకాశం ఉంది. రోగులు ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం ద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ఫలితంగా సామాజిక ఆర్థిక ఆరోగ్యం ఆందోళనకర స్థాయికి చేరుకునే ప్రమాదం ఉంది. సమాజం జీవన ప్రమాణాలు దెబ్బతినే ప్రభావం ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎస్ఐని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును మండల టిడిపి అధ్యక్షులు కళ్ళే రెడ్డప్ప ఆధ్వర్యంలో టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల క్లస్టర్ ఇంచార్జ్ తాతిశెట్టి శివకుమార్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఎస్సీ నాయకులు దబ్బేపల్లి చంద్రమౌళి, బిసి సెల్ అధ్యక్షులు బెల్లాల రమణయ్య, సీనియర్ నాయకులు శివరామ నాయుడు, ఐ టిడిపి ఎన్.ఎస్.రమణ, నాయకులు ఎస్ఐని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఎస్ఐ రామాంజనేయులుకు సన్మానం

కలకడ: మండల కేంద్రమైన కలకడ పోలీసు స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్ఐ రామాంజనేయులును శనివారం టిడిపి నాయకులు సన్మానించారు. మండలంలోని దేవలపల్లికు చెందిన టిడిపి ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తిని ఎల్లయ్య కోనకు చెందిన టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు రామానుజులు, రాజశేఖర్‌లు కలిసి పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఎస్ఐ రామాంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

నిమ్మనపల్లి ఎస్ఐగా తిప్పేస్వామి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నిమ్మనపల్లి నూతన ఎస్ఐగా సి.తిప్పేస్వామి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న సి.లోకేష్‌రెడ్డి తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, ములకలచెరువు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సి.తిప్పేస్వామి నిమ్మనపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు- పోలీసులు మధ్య సత్సంబంధాలు ఉండాలని, ఫ్రెండ్లీ పోలీస్ వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మండల పరిధిలో జరుగుతున్న నాటుసారా తయారీ, విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐను టిడిపి, జనసేన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

బి.కొత్తకోట సిఐగా రాజారెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట పోలీసుస్టేషన్ సిఐగా రాజారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ సూర్యనారాయణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రెగ్యులర్ సిఐగా రాజారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. బి.కొత్తకోట పట్టణం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉండటంవల్ల ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు, నేరాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

సిఐ రాజారెడ్డి

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి-రామాపురం: మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఇక అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు అని ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇసుకను ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై తీవ్ర కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తగ్గేదిలేదని, దొరికిన ప్రతి ఇసుక ట్రాక్టర్ పై కేసు నమోదు చేసి డ్రైవర్‌తో సహ ట్రాక్టర్లను కోర్టుకు పంపిస్తామని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు తమ ఆధార్ కార్డు అనుసరించి ఆధారంతో వెళ్లి అక్కడ ఉచితంగా ఇసుక ఇస్తారని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ఇసుక వినియోగదారులకు తెలిపారు. కొంతమంది అనుమతులతో వంకల్లో నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో రాయచోటి ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారని వారిపై తీవ్రంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కన్నెమడుగు సర్పంచ్ శ్యామలమ్మ మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు గ్రామ పంచాయతీ సర్పంచ్ బి.శ్యామలమ్మ(70) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. మూడు నెలల క్రితం ఆమె అనారోగ్య బారిన పడి బెంగళూరులో చికిత్సలు పొందుతూ మరణించారు. పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు ఆమె మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరుగుతాయని ఆమెకుమారులు రామకృష్ణారెడ్డి, రవి శంకర్ రెడ్డిలు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బి.టెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు మెడిటేషన్, యోగ గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రహ్మ కుమార్ శాంతా కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాంతిగా ఉండాలి, మనకు ఏది మంచి, ఏది చెడు అను నిర్ణయించుకునే శక్తి ఉండాలి. మనస్సును ఏకాగ్రతపై తీసుకురావడానికి ధ్యానం చాలా అవసరమని సూచించారు. ధ్యానం ద్వారా మన శరీరం, మనస్సు, యవ్వనంగా ఉంటాయని అన్నారు. మనకు ఒత్తిడిని జయించే శక్తి మనకు వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ 20 నిమిషాలపాటు చేయాలని సూచించారు.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E. P. No. 45/2019
IN
O S.No: 19/2017

కొండాగారి రమేష్, భర్త తిరుపాలు, పోలి గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...D.Hr

వర్సెస్

1. కొండ్రాజు చెంగయ్య తండ్రి జగన్నాథ్ చనిపోయినందున వారి వారసులు.
2. కొండ్రాజు అనిల్ తండ్రి లేట్ కొండ్రాజు చెంగయ్య
3. కొండ్రాజు కుమార్ తండ్రి లేట్ కొండ్రాజు చెంగయ్య, పోలి గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా.

...2,3 J.DRs

పై DHr.Jdr. అయిన కొండ్రాజు చెంగయ్య పైన బాకీ వసూలు నిమిత్తమై E.P. దాఖలు చేసియున్నాము. సదరు E.P. పెండింగ్ సమయంలో కొండ్రాజు చెంగయ్య గారు మరణించుట వలన వారి వారసులుగా మిమ్ములను చేర్చుటకు E.P. పెట్టడమైనది. పేపరు ప్రకటన ద్వారా నోటీసులు ఇచ్చుటకొరకు E.P. దాఖలు చేయబడినది. సదరు విషయము మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో పై కేసు తేదీ 09.09.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై మీరు విచారింపబడవలెను లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
పి.వల్లభ రావు
D.Hr. తరఫున అడ్వకేట్
రాజంపేట.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలం గర్నిమిట్ట పిహెచ్‌సి పరిధిలోని వగళ్ల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, సబ్ యూనిట్ అధికారి ముజీబ్, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తంలు డాక్టర్ రేష్మ పర్యవేక్షణలో దోమల ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు జ్వరాలపై వివరించారు. ఈ ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఇటీవలే ప్రభుత్వం మలేరియా వ్యాధిని నోటిఫైయబుల్ డిసీస్‌గా గుర్తించిందని అన్నారు. తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్పలేకపోవడం, శరీరంపై దద్దులు, రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, కీళ్లనొప్పులు వంటి లక్షణాలు ఈ జ్వరాలలో కనిపిస్తాయి. వ్యాధి లక్షణాలు ను బట్టి రక్తపరీక్షలు చేయించుకుని, సకాలంలో చికిత్స పొందితే ప్రాణాపాయం ఉండదని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేసుకోవాలన్నారు. పందులను గ్రామానికి 5కి.మీ దూరంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటిం చాలని, నీటి నిల్వలు పై మూతలు ఉంచాలని, దోమతెరలు వాడాలన్నారు. కిటికీలకు మెష్ కొట్టించాలిలని, ప్రతి రోజు సాయంత్రం ఇంటిలో పచ్చి వేపాకు పొగ వేసుకోవాలని, ప్రతి రోజు ఇంటిలో సాయంత్రం లైట్స్ వేసినప్పుడు తలుపులు, కిటికీలు మూసి వేయాలన్నారు. కాలువలలో చెత్తవేయరాదని, గర్భిణులు, బాలింతలు, పది సంవత్సరాలు లోపు పిల్లలు, అరవై సంవత్సరాలు పైబడిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉంటుందని వీరిపై ఎక్కువ జాగ్రత్తగా ఉండా లన్నారు. దోమల నిర్మూలన కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే దోమలపై దండయాత్ర విజయవంతం అవుతుందన్నారు. గాలి ద్వారా వ్యాప్తి చెందు క్షయ వ్యాధి లక్షణాలు, దేనివలన క్షయ వ్యాధి వస్తుంది, ఎలా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించడం జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ ఎలా, ఎక్కడ చేస్తారు, వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఇస్తారు, వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాల గురించి వివరించారు. నీటి ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులు టైఫాయిడ్, డయేరియా, కామెర్లు, డిసెంట్రీ వ్యాధుల గురించి తెలియజేశారు. అనంతరం చేతుల శుభ్రత లోని ఆరు దశలు చేసి చూపించి విద్యార్థుల చేత చేయించారు. కార్యక్రమంలో కెజిబివిపత్యేక అధికారి శ్రావణి, స్టాఫ్ నర్స్ సులోచన, ఉపాధ్యాయులు, ఎఎన్ఎం అలేఖ్య, ఆశా కార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న మహమ్మద్‌రఫీ

'వయ్యారిభామ' నిర్మూలనపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో వయ్యారిభామ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని కెవికె కలికిరి శాస్త్రవేత్తలు నిర్వహించారు. గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్ర గడ్డి, ముక్కుపుల్ల మొక్క, మొదలగు పేర్లతో కూడా ఈ వయ్యారిభామ మొక్క పిలవబడుతుందని అన్నారు. శాస్త్రవేత్త సోముశేఖర్‌బాబు మాట్లాడుతూ వయ్యారిభామ కలిగించే నష్టాలు ,యాజమాన్య పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ఈ మొక్క భారత దేశంలోకి అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న గోధుమల ద్వారా ప్రవేశించి ఎక్కువ సమస్యగా మారిందని అన్నారు. అలాగే మనుషులకు చర్మ, ఊపిరి తిత్తు వ్యాధులు కలగజేస్తుందని, ఈ కలుపు పంటల్లో 40శాతం, పశుగ్రాసంలో 90 శాతం దిగుబడిని తగ్గిస్తుందని తెలిపారు. ఈ మొక్కల ద్వారా వివిధ పంటలలో వైరస్ తెగుళ్లు వ్యాపిస్తున్నాయని, వీటి నివారణకై పూత రాకమునుపే మొక్కలను పీకి కాల్చివేయాలన్నారు. పంట తోటల వరుసల మధ్యలో ట్రాక్టర్ టిల్లర్‌తో సంవత్సరంలో మూడు నాలుగు సార్లు దున్నేసి భూమిలో కలిపి వేయాలని తెలిపారు. జైగోగ్రామబైకొలరేట అనే పురుగులను వదిలి జీవ నియంత్రణ పద్ధతి ద్వారా నివారించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపల్ డాక్టర్ ఎ.సుబ్రమణ్యం, కెవికె శాస్త్రవేత్తలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్‌గా కోట రమేష్

ప్రజాశక్తి-కలకడ

ఆదర్శ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ గా కోట రమేష్ ను ఏకగ్రీవంగా అనుకున్నట్లు ప్రిన్సిపల్ మలం షావలి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలలో ఈనెల 8న స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నికలు సజావుగా జరిగే చైర్మన్ లను ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడిన విషయం పాఠకులకు తెలిసిందే.ఈ ఎన్నికలను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విధంగానే శనివారం స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నికలను నిర్వహించగా ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.ఈ ఎన్నికలో పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించగా చైర్మన్ గా కోట రమేష్, వైస్ చైర్మన్‌గా రిజ్వానా అక్బర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. 15 మంది స్కూల్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అందుకోసం స్కూల్ కమిటీ సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తనకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఇఒలు మునీంద్ర నాయక్, రామచంద్రారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు కంబెల్ల రమేష్, నాగరాజా, పోలీసులు మహబూబ్‌బాషా, యూనస్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న చైర్మన్, కమిటీ సభ్యులు

భోజనాన్ని వడ్డిస్తున్న ప్రసాద్‌బాబు

అన్నదానం గొప్పది : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

అన్నదానం గొప్పదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, టిటిడి మాజీ పాలకవర్గ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా పట్టణంలోని గాలివీడు రోడ్డు మార్గంలో గ్రూప్ థియేటర్ సమీపంలో మాండవ్యవనది ఒడ్డున వెలిసిన శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో టిడిపి నాయకుడు మన్నేరు రామాంజనేయులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాసంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకొని సమజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, లాయర్ సతీష్ రెడ్డి, సురేంద్ర, బడిశెట్టి రవికుమార్, మంత్రి రెడ్డయ్య, సుగవాసి ఈశ్వర్, యడం సుధీర్, భూపతి, వెంకటేశ్వర్లు, కటారు శివ, మన్నేరు రాజా, మన్నేరు శేఖర్, మన్నేరు శివ, కేసి ప్రసాద్, సివి ప్రసాద్, త్యాగరాజు, ఏనుగుల విశ్వనాథ, పసుపులేటి నాగేంద్ర, రమణ, రవి, పెరికల రెడ్డన్న, అకౌంటెంట్ ప్రసాద్, సుగవాసి బాలరామ్ పాల్గొన్నారు.

పార్టీలో విభేదాలు అవాస్తవం : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పార్టీలో విభేదాలు అన్న మాట పూర్తిగా అవాస్తవమని, క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాతనే ఇతరులకు ప్రాధాన్యత ఉంటుందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జే.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం నిమ్మనపల్లి సర్కిల్లో టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో పభుత్వం శుక్రవారం అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని అన్నారు. మదనపల్లి పట్టణంలో దినసరి సంత, టమోటో మార్కెట్ యార్డ్ వద్ద ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే తనతో పాటు అందరిని ఆహ్వానించారని,వారి సొంత పనులను నిమిత్తం అందరూ ఆ సమయానికి చేరుకోలేకపోయారన్నారు. అనంతరం జిల్లా టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు మదనపల్లికి విచ్చేసి అన్న క్యాంటీన్లు సందర్శించారని అన్నారు. పార్టీ నియమం ప్రకారం నాయకులు, కార్యకర్తలు ఆయనను కలవడం జరిగిందన్నారు. ఈ అంశాన్ని పనిగట్టుకుని కొన్ని చానళ్లు, వార్తాపత్రికలు టిడిపిలో విభేదాలు మొదలయ్యాయని ప్రచారం చేయడం జరిగిందని, ఇది సమంజసం కాదని అన్నారు. నియోజకవర్గంలో ప్రజల చేత ఎన్నుకున్న ఎమ్మెల్యేకి సర్వాధికారాలు ఉంటాయని, ఆయన నిర్ణయాలకు తొలి ప్రాధాన్యత నివ్వాలన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఈ విషయంలో ఎటువంటి అపోహలు వద్దని సూచించారు. టిడిపి మైనార్టీ నాయకులు అన్వర్ బాషా జిల్లా అధ్యక్షుడికి తన సమస్యను విన్నవించుకొని ఆదుకోవాలని కోరడం జరిగిందని, అయితే ఆయన మాటలను కొందరు వక్రీకరించి ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం అందించారని అన్నారు. ఇటువంటి విధానాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు మానుకోవాలన్నారు. మైనార్టీ నాయకులు అన్వర్ బాషా మాట్లాడుతూ తాను టిడిపికి వీర విధేయుడునని, అటువంటి వ్యక్తిని తాను ఎందుకు విమర్శిస్తానని అన్నారు. కార్యక్రమంలో అరికెల జడ్‌పిహెచ్‌ఎస్ ఎస్ఎంసి అధ్యక్షులు భువనేశ్వర్ రెడ్డి, జరిపిటి రామ్మూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

చదువులో రాణిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చదువులో రాణిస్తేనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్బా రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది తొమ్మిదవ తరగతి పరీక్షలలో రాణించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, తమ కుటుంబ సభ్యురాలైన కోసూరు నళిని స్మారక అవార్డులను చదువులో రాణించిన ప్రతిభావంతులకు అందజేయడం జరిగిందన్నారు. గత ఏడాది మంచి మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు జకియా, రోహిత్ కుమార్, షబాన, దీక్షిత్ సాయిలకు ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు, జ్ఞాపికలు, సర్టిఫికెట్స్, రాత సామగ్రి, లైబ్రరీ పుస్తకాలు, పెన్నులు అందించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఫోర్డ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ లలితమ్మ, పోలీస్ అధికారి రామమూర్తి, రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ ఖాన్, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, ఆర్.వి.రమణ, విజయమ్మ, రసూల్, బావాజి, వహీదా రెహమాన్, పుణ్యవతి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం

బిసి అసెంబ్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈనెల 20న విజయవాడలో జరిగే బిసి అసెంబ్లీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక బిఎస్‌పి కార్యాలయంలో బిసి సంఘాలతో సమావేశం నిర్వహించి బిసి సంఘాల నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. 20న విజయవాడలోని శ్రీపాదహోటల్‌లో బిసి కులగణన అంశంపై బిసి అసెంబ్లీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు, రజక సంఘం నాయకులు శివ, ఈడిగ గౌడ్ సంఘం నాయకులు ప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు అరుణ్, మేదర సంఘం నాయకులు అర్జున్, వడ్డెర సంఘం నాయకులు ప్రసాద్, తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు రవితేజలు పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, వైసిపి, టిడిపిలు కేవలం బీసీలను ఓట్ల యంత్రాలుగా చూస్తూ అధికారంలోకి వచ్చి 50 శాతం ఉన్న బిసిలకు కేవలం 10 శాతం మాత్రమే రాజకీయాల్లో ఎమ్మెల్యే ఎంపీ స్థానాలు కల్పించడం వారి సామాజిక వర్గాలకు 50 శాతం ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలే కాకుండా మంత్రులు ముఖ్యమంత్రి స్థానాలను కట్టబెట్టు కుంటున్నారని అన్నారు. బిసి కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిసిలతోనే అధికారంలోకి వచ్చామని చెబుతున్న టిడిపి వెంటనే బిసి కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు బాలాజీ, శివ, సంధ్య, కిషోర్, సోము శేఖర్, మల్లికార్జున, చంద్ర, హరి, మహేష్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

తహశీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు

రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాలని తెలిపారు. ఫ్రీఓల్డ్ భూముల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొని తగిన సలహాలు, సూచనలు అందజేశారు. కార్య క్ర మంలో డిటి మోహన్, ఆర్ఐ సుశీల్, విఆర్ఒలు, విఆర్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

నాణ్యమైన విద్యను అందించండి : డిఇఒ

ప్రజాశక్తి-కలకడ

ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి తనిఖీలు నిర్వహించడం తెలిపారు. మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగులో శనివారం స్థానిక పాఠశాలలో గణితం, తెలుగు, బయాలజీ సైన్స్ పాఠ్యాంశాలకు చెందిన కలకడ, కలికిరి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ తరగతులను పరిశీలించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఏడాది నుండి విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడానికి ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు మునీంద్రనాయక్, రామచంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సరస్వతి సత్కరించారు.

జన్మదిన వేడుకల్లో పంతగాని ప్రసాద్

ఘనంగా 'పంతగాని' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి కార్యకర్తలు తనపై చూపుతున్న అభిమానం ఎన్నడు మరువలేనని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. శనివారం పంతగాని క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల నడుమ తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు పెద్ద కేకును ఏర్పాటుచేసి పంతగాని చేత కట్ చేయించారు. పూలమాలలు,శాలువలు, బొకేలతో ఆయనను ఘనంగా సన్మానించారు.టోల్గేట్ సెంటర్ మాత్మ గాంధీ విగ్రహం వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేయడం గొప్ప భాగ్యమని చెప్పారు. కార్యక్రమంలో కమతం నాగరాజు, బాలిశెట్టి హరి,మౌల, జుబేర్, చాపల మడుగు సూరి, సర్పంచ్ మామిళ్ళ సుబ్బయ్య,మామిళ్ళ సుబ్రహ్మణ్యం,స్తూరి దినేష్ చౌదరి,మందపాటి శంకరయ్య, హేమంత్ కుమార్, కిషోర్,చిగురుపాటి శంకర పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపడదాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినాయకచవితికి విగ్రహాలు ఏర్పాటు చేసే యువత పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమానికి శ్రీకారం చుడుదామని వెల్ విషర్స్ వ్యవస్థాపకుడు నల్లగుట్ల గిరీష్ పిలుపునిచ్చారు. ఆయా ప్రాంతాలలో ఇంటి ఇంటికి తిరిగి చందాలు వసూలు చేసే సందర్భంలో మీ ఇంటి లో రక్తదానం చేయడానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా అని అడిగి తెలుసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారి పేరు , బ్లడ్ గ్రూప్ , ఫోన్ నెంబరు తదితర వివరాలు సేకరించి ఒక పేపరు లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇలా సేకరించడం వల్ల కనీసం ఓ ఇరవై మంది రక్తదాతల వివరాలు తెలిసే అవకాశం ఉంటుందని అన్నారు.వాటిని ఓ ఐదారు కాపీలు జిరాక్స్ చేయించి, బాగా యాక్టివ్‌గా ఉండే సభ్యుల వద్ద ఉంచడం వల్ల ఆయా ప్రాంతంలోని వారందరికీ మీకు బ్లడ్ అవసరం అయితే రక్తదాతల వివరాలు ఫలానా వారి వద్ద ఉన్నాయి అనే విషయం తెలియజేయవచ్చున్నారు. ఇంకా వినాయక మండపాల వద్ద రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, రక్త వర్గాలు తెలియజేసే శిబిరాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గిరీష్ తెలిపారు. యువత ఒకసారి పాజిటివ్ గా ఆలోచించి, తమ తమ గ్రూపు సభ్యులతో చర్చించి ఓ మంచి నిర్ణయం తీసుకుని సమాజ సేవకు శ్రీకారం చుట్టాలని అభ్యర్థించారు. ఇందుకు అవసరమయ్యే అన్ని రకాల సహాయసహకారాలు అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఈ గొప్ప కార్యానికి సిద్ధపడే వారు తన మొబైల్ 9059491315 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

కోమటివాని చెరువు ప్రక్షాళన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణ నడిబొడ్డున ఉన్న కోమిటివానిచెరువు మదనపల్లె ట్యాంక్‌బండ్‌గా పిలవబడుతుంది. ఈ చెరువులోకి పట్టణం నలుమూలల నుంచి మురుగునీరు, చెత్తా, చెదారం చేరడంతో పాటు వ్యర్థాలను ఇక్కడే వేయడంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతూ పట్టణ ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా ఉంటోంది. గత వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చెరువు నిండిపోయి నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా చెత్తా చెదరం పేరుకుపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చెరువు ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. చెరువు కట్టపై మరమ్మతులు చేయిస్తూ చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. టిడిపి నాయకులు జెసిబి మధు తన జెసిబిలు, హిటాచీలు, పది చక్రాల వాహనాలతో గత నాలుగు రోజులుగా శ్రమించి చెరువులోని చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగిస్తూ ప్రక్షాళన పనులు చేపట్టారు. దీంతో చెరువు పూర్వవైభవాన్ని సంతరించుకొని తిరిగి పట్టణ ప్రజలకు అందుబాటులోకి వచ్చేందుకు శ్రమిస్తున్నారు. చెరువులో వ్యర్థాలు వేసినా, మురుగునీటిని ప్రవహింప జేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఇప్పటికే ప్రకటించారు. ప్రజలు సైతం ఇది మన చెరువు గా, భావి తరాల వారికి మనమిచ్చే ఆస్తి గా భావించు కాపాడుకోవాలని జెసిబి మధు పిలుపునిచ్చారు.

చెత్తను తొలగించడంతో శుభ్రంగా దర్శనమిస్తున్న చెరువు